వైద్య సేవలు మెరుగు!

- ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది
- అందరి మన్ననలు పొందుతున్న 'ఫ్యామిలీ డాక్టర్'



పెద్దహరివాణంలో మహిళకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ మధులిక



చిన్నహరివాణం గ్రామ సచివాలయంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్, సిబ్బంది

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. ప్రజలకు అన్ని విధాల వైద్య సేవలు అందజేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఉన్న ఆసుపత్రులకు మరమ్మతులు చేపట్టడంతోపాటు వైద్య సిబ్బందిని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆరోగ్యశ్రీ పరిధిని పెంచడంతోపాటు వైఎస్సార్ కంటి వెలుగు తదితర పథకాలు అమలు చేస్తూ ప్రజారోగ్య పరరక్షణకు కృషి చేస్తుంది. అదేవిధంగా హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు చేపట్టి పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. ప్రత్యేకించి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర కాన్సెప్ట్ కార్యక్రమం అందరి మన్ననలు పొందుతుంది. డాక్టర్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సూపర్ వైజర్‌లు గ్రామాలకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ జబ్బులతో బాధపడుతున్న ప్రతిఒక్కరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు మందులు అందజేస్తున్నారు. ప్రత్యేకించి నడవలేని వృద్ధులు, దీర్ఘకాలిక రోగాలతో మంచానికే పరిమితమైన రోగుల వద్దకే డాక్టర్లు వెళ్లి వైద్య సేవలు అందజేస్తుండడంతో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సూపర్‌వైజర్‌లు, 104 అంబులెన్స్‌లో గ్రామాలకు వెళ్లి ఇంట్లో ఉన్న ప్రతిఒక్కరినీ విచారించి పరీక్షలు చేసి తగిన వైద్యం అందించి మందులను పంపిణీ చేస్తున్నారు. ముందుగానే ప్రకటించిన తేదీలవారీగా గ్రామాలకు, ప్రతి వాడకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నది జగనన్న ప్రభుత్వమేనని అన్ని వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆదోని డివిజన్‌లో 235 హెల్త్ క్లినిక్‌లు

ఆదోని డివిజన్ పరిధిలో 235 హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. ఆదోని పట్టణంలో 42, రూరల్‌లో 193 క్లినిక్‌లు ఉన్నాయి. ఒక్కొక్క సెంటర్‌లో రోజుకి 70 నుంచి 80 మంది వరకు రోగులు వైద్యం పొందుతున్నారు. 235 కేంద్రాల్లో నెలకు దాదాపుగా 17 వేల మంది వరకు పేదలు వైద్యం అందుతుంది. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతో పాటు మంచం పట్టిన రోగులు, బాలింతలు, గర్భిణులకు, పిల్లలకు వైద్యులు ఇంటి వద్దకు వెళ్లి పరీక్షలు చేసి వైద్యాన్ని అందిస్తున్నారు.



చిన్నారికి టీకా వేస్తున్న ఏఎన్‌ఎం

ప్రతి ఇంటి వద్దకు వైద్య సేవలు



ఆదోని డివిజన్‌లోని , ప్రతి గడపకు వెళ్లి ఇంటి వద్దనే వైద్యం అందిస్తున్నాం. డాక్టర్, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది, సూపర్‌వైజర్‌లు టీంగా 104 అంబులెన్స్‌లో ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నాం. వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు సత్ఫలితానిస్తోంది. ప్రజలు పట్టణాలకు వెళ్లి ప్రయివేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాలంటే ఖర్చు అవుతుంది. ఫ్యామిలీ క్లీనిక్స్‌తో ప్రజలకు పైసా ఖర్చు లేకుండా వైద్యం అందిస్తున్నాం.

– డాక్టర్ సత్యవతి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

ఇంటి వద్దకే డాక్టర్ వచ్చి వైద్యం చేస్తున్నారు



ఇంటి వద్దకే డాక్టర్ వచ్చి వైద్యం చేస్తున్నారు. ఏ మందులు ఎప్పుడు వాడాలి, ఎలా వాడాలి, జబ్బుకు సంబంధించిన జాగ్రత్తలను చెప్పి వెళ్తున్నారు. చాలా మంచి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటివరకు ఎవరూ ఇలా ఇంటి వద్దకు వచ్చి వైద్యం అందించలేదు. జగన్ పేదల కోసం అన్నీ చేస్తున్నారు. – నాగమ్మ, పెద్దహరివాణం

13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు

ఆదోని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ పరిధిలో 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో దాదాపు 10 లక్షల జనాభా ఉంది. హొళగుంద, కోసిగి, గొనెగండ్ల, కౌతాళం, పెద్ద కడబూరు, పెద్దతుంబళం, నందవరం, దైవందిన్నె, పెద్దహరివాణం, గజ్జహళ్లి, హాలహర్వి–ఎన్, బదినేహాల్, కల్లుదేవకుంట ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా పేదలకు వైద్యం అందుతోంది.

క్లుప్తంగా

వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన విక్రమ్‌సింహా



ఆదోని టౌన్ : ఆదోని వన్‌టౌన్ సీఐగా బీవీ విక్రమ్‌సింహా గురువారం తిరిగి బాధ్యతలను స్వీకరించారు. 2021లో కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో సీఐగా పనిచేస్తున్న విక్రమ్ సింహా సెబ్ దాడుల్లో పట్టుబడిన 105 కేజీల వెండిని భద్రపరచడం, ఆయన బదిలీ అనంతరం బాధ్యతలు స్వీకరించిన అధికారికి రాతపూర్వకంగా అప్పగించడంలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేసి సస్పెండ్ చేశారు. అయితే విచారణలో వాస్తవాలు వెలుగు చూశాయి. దీంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు సీఐ విక్రమ్‌సింహాను మళ్లీ ఆదోని వన్‌టౌన్ సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

పెద్దకడబూరు : జిల్లా గ్రంథాలయ సంస్థ కర్నూలు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహించే సమ్మర్ క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ ఆశాజ్యోతి పేర్కొన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో ప్రతిరోజు ఉదయం 8 నుంచి 10గంటల వరకు పుస్తక పఠనం, 10 నుంచి 11 గంటలవరకు కథలు చెప్పండి, 11 నుంచి 12 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం, నాట్యము, సంగీతం, పెయింటింగ్, ప్రసంగాలపై శిక్షణ ఉంటుందన్నారు. అదేవిధంగా క్యారమ్, చెస్, మ్యూజికల్ చైర్స్ వంటి గేమ్స్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు తమ పేర్లను స్థానిక గ్రంథాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

అవోపా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఆదోని అర్బన్ : పట్టణంలో అవోపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో ఆరు రోజులపాటు నిర్వహిస్తున్న ఉచిత ఆక్యుప్రెషర్ శిబిరాన్ని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సతీమణి శైలజారెడ్డి సందర్శించారు. గుజరాత్ నుంచి వచ్చిన వైద్యులతో ఐదు రకాల థెరపీ చేయించుకున్నారు. ఈ పద్ధతి ద్వారా మందులు లేకుండా ఎన్నో వ్యాధులు నయమవుతున్నాయని, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలకు సేవలు అందించాలని నిర్వాహకులను ఆమె కోరారు. కార్యక్రమం ఈనెల 6వ తేదీ వరకు ఉంటుందని నిర్వాహకులు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. కార్యక్రమంలో రాజస్థాన్ నుంచి వచ్చిన డాక్టర్స్ తనరాజ్‌చౌదరి, రేవంత్‌చౌదరి, మహిళా విభాగ్ సభ్యులు సంగీత, మమతాశ్రీ, హిమబిందు, గీత, యశోద, పరిమళ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

95 శాతం పింఛన్ల పంపిణీ



వాల్మీకినగర్‌లో దివ్యాంగుడు అజయ్‌కి పింఛన్ కానుకను అందజేస్తున్న వాలంటీర్, వెల్ఫేర్ సెక్రటరీ

ఆదోని టౌన్ : ఆదోని మున్సిపాలిటీలో ఈనెల 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారానికి 95 శాతానికి చేరుకుంది. మిగిలిన 5 శాతం శుక్రవారం పూర్తి చేయనున్నట్లు మున్సిపల్ సంబంధిత సెక్షన్ అధికారి నరహరి తెలిపారు. పట్టణంలోని 42 వార్డుల పరిధిలో 16,605 పింఛన్లు ఉన్నాయి. ఆయా పింఛన్‌దారులకు సంబంధించి రూ.4,64,515 పంపిణీ చేయనున్నామని చెప్పారు.

వివాహిత ఆత్మహత్య

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మల్కాపురం గ్రామంలో కడుపునొప్పి తాళలేక గొల్ల పార్వతి (23) అనే వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన మేకల నాగరాజు, భార్య గొల్ల పార్వతి, వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత కొంత కాలంగా పార్వతి కడుపునొప్పితో బాధపడుతోంది. హాస్పిటల్‌లో చూయించినా తగ్గకపోవడంతో ఎవరూ లేని సమయంతో ఇంటి పైకప్పునకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంటికి వచ్చి భర్త, కుటుంబ సభ్యులు వేలాడుతున్న పార్వతిని కిందకు దించి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ఉపాధి కూలీల పొట్ట కొట్టేందుకు కుట్ర

తుగ్గలి: ఉపాధి కూలీల పొట్టకొట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు శ్రీరాములు ఆరోపించారు. గురువారం తుగ్గలిలో ఉపాధి పనుల వద్ద కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వలసల నివారణ కోసం వామపక్షాల సూచనల మేరకు గత యూపీఏ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. బడ్జెట్‌లో 25 శాతం కోత విధించడంతో పాటు, రెండు పూటలా పనులు, హాజరు నిబంధనలతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

నవనాగ గణపతికి ప్రత్యేక పూజలు

ఆదోని అర్బన్ : మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో వెలసిన శ్రీ నవనాగగణపతి సమేత మానసాగాయత్రీ ఆలయంలో 46వ రథోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం స్వామివారికి, అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు, జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మ, స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం అమ్మ, స్వామివార్ల రథోత్సవం ఉంటుందని వేద పండితుడు గరుడాద్రి దత్తాత్రేయశర్మ తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

పెద్దకడబూరు : ఎంపీపీ శ్రీవిద్య అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణప్ప తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు తమతమ అభివృద్ధి నివేదికతో హాజరు కావాలన్నారు. అదేవిధంగా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమావేశంలో పాల్గొని మండల అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్ : మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన తలారి దుర్గమ్మ అనే మహిళ ఇంటి వద్ద అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు గురువారం తెలిపారు. ఏఎస్‌ఐ వెంకటరమణ, సిబ్బంది పక్కా సమాచారం మేరకు అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఆమె నుంచి 79 (90ఎం.ఎల్.) టీసీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

శుభకార్యం

కోసిగి: ఆదోని మండల పాండవగల్లు ఆంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన చిన్నభూంపల్లి జంగం ఆంజనేయులు, కామన్‌దొడ్డి కేశ బ్రదర్స్ వివాహ వేడుకలకు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి హాజరయ్యారు. నూతన వధువరూలకు అక్షింతలు వేసి ఆశీర్వాదించారు.

కర్ణాటక బార్డర్‌లో ప్రత్యేక నిఘా

- డీఎస్పీ సీతారామయ్య



కోసిగి పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ సీతారామయ్య

కోసిగి: ఆంధ్ర– కర్ణాటక బార్డర్ ప్రాంతాల్లో చెక్ పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మిగనూరు డీఎస్పీ బి. సీతారామయ్య పేర్కొన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఆయన గురువారం రాత్రి కోసిగి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సీఐ ఎరిసా వలి, ఎస్‌ఐ రాజారెడ్డిలతో కోసిగి సర్కిల్ పరిధి వివరాలు, సమస్యాత్మక గ్రామాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, అక్రమ రవాణాలు జరుగకుండా నిఘా పెంచుతామన్నారు. అలాగే డివిజ్ పరిధిలోని శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన డీఎస్పీ

మంత్రాలయం రూరల్: మంత్రాలయం, మాధవరం పోలీస్ స్టేషన్‌లను ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య గురువారం తనిఖీ చేశారు. ముందుగా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద రికార్డులను తనిఖీ చేసి కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రెండు పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కర్ణాటక మద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వేణుగోపాల్‌రాజు, కిరణ్ తదితరులు ఉన్నారు.

నరసింహస్వామిని దర్శించుకున్న ప్రదీప్‌రెడ్డి



ప్రదీప్‌రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న ఆలయ అర్చకులు

పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో వెలసిన నరసింహస్వాముల జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు ప్రదీప్‌రెడ్డి గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు హరిస్వామి, నరసింహస్మామి ప్రదీప్‌రెడ్డిని ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ఫల, పుష్ప, ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. అదేవిధంగా వైఎస్సార్ సీపీ సేవాదళ్ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, గొర్రెల ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్ యల్లప్ప, నాయకులు బొడ్డన్న, రాముడు, లింగన్నగౌడ్, బ్రహ్మయ్య, మల్లయ్య, వీరేష్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఆర్బీకే సేవలు విస్తృతం చేయండి



ఆర్బీకే సిబ్బందికి సూచనలిస్తున్న ఏడీఏ సునీత

ఆలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్బీకేల సేవలు ప్రతి రైతుకు అందేలా సిబ్బంది పనిచేయాలని ఆలూరు ఏడీఏ సునీత ఆదేశించారు. ఆమె గురువారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని 76 ఆర్బీకేల సిబ్బందికి ఖరీఫ్, రబీ సీజన్ల యాక్షన్ ప్లాన్‌పై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రమేష్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. .రైతులు సాయిల్ టెస్ట్ చేయించుకునేలా ప్రోత్సహించాలని, నకిలీ విత్తనాలపై అప్రమత్తం చేయాలన్నారు. విత్తనాలపై అనుమానం ఉంటే అగ్రిల్యాబ్‌కు పంపించి టెస్ట్ చేయించాలన్నారు. నేలలో తేమ శాతం ఉన్నప్పుడే విత్తనం వేసేలా చూడాలని, రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందుల ఆర్డర్ చేయించాలన్నారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో పంట నమోదు ప్రక్రియ సాంకేతిక పరిజ్ఞానంతో చేయాల్సి ఉంటుందని, జియో ట్యాగింగ్ ద్వారా క్రాప్ బుకింగ్ నమోదు జరుగుతుందన్నారు. కస్టమర్ హైరింగ్ సెంటర్ల ద్వారా రైతు గ్రూపులకు సబ్సిడీ యంత్రాలు అందించాలన్నారు. ఏఓలు వెంటేష్ గౌడ్, నరేంద్ర కుమార్, శివ శంకర్ అగ్రిల్యాబ్ టెక్నికల్ ఏఓ రాజేష్ ఆర్బీకే సిబ్బంది హాజరయ్యారు.

నేటి నుంచి భీరప్ప దేవర

నందవరం: మండలంలో కురబల కులదైవం భీరలింగేశ్వరుడి దేవర శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. ఆలయ కట్ట పరిధిలోని 72 గ్రామాల పూజారులు బండారి, పల్లకీ సేవల్లో పాల్గొననున్నారు. పవిత్ర తుంగభద్ర నది జలాలతో స్వామికి అభిషేకాలు గావించి దేవర ఉత్సవాలు ప్రారంభిస్తారు. స్వామికి పల్లకి సేవలు, జలాభిషేకాలు, హోమాలు, బండారి వంటి ప్రత్యేక పూజలు గావించనున్నారు. దేవర సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, రంగులతో అలంకరించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టనున్నారు.

అన్నదానానికి రూ.50వేలు విరాళం



క్యాష్ కౌంటింగ్ మిషన్‌ను అందజేస్తున్న భక్తుడు

కౌతాళం : ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి గురువారం ఆదోనికి చెందిన బీసీ రాంప్రసాద్, లక్ష్మీదేవి దంపతులు రూ. 50వేలు విరాళం అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమీషనర్ వాణి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నాగరాజుగౌడు తెలిపారు. దాతలను ఆలయ అధికారులు శాలువ, పూలమాలలతో సత్కరించి లడ్డూ ప్రసాదాలను, స్వామివారి ఫొటోలు అందజేశారు.

క్యాష్ కౌటింగ్ మిషన్ విరాళం :

హైదరాబాద్‌కు చెందిన కొత్తింటి ఆనంద్‌కుమార్, రూపారమ్య దంపతులు డోనేషన్ కౌంటర్‌కు అత్యాధునిక, సాంకేతిక కలిగిన క్యాష్ కౌటింగ్ మిషన్‌ను అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు లడ్డూప్రసాదాలు అందజేసి స్వామివారి ఫొటోలను అందజేశారు.

ఆధ్యాత్మికం

భక్తిశ్రద్ధలతో నరసింహస్వామి జయంతి



హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు



ఈరన్నస్వామి

కౌతాళం : జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో నరసింహస్వామి జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. తెల్లవారు జామున 5గంటలకు సుప్రభాతసేవ, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు ఈరప్పస్వామి, ఉప ప్రధాన అర్చకులు మహాదేవ స్వామి ఆధ్వర్యంలో అర్చకుల బృందం హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు డైరెక్టర్‌లు, ఆలయ పర్యావేక్షకులు మల్లికార్జున, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహాస్వామి జయంతి వేడుకలు

మంత్రాలయం రూరల్: కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని నంజనగూడ మఠంలో శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహాస్వామి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామివారి విగ్రహానికి ఫల, పుష్ప, క్షీరా, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వేడుకల్లో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

వైభవంగా లక్ష్మి నరసింహాస్వామి జయంతి



లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని మాధవరం గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహాస్వామి దేవాలయంలో గురువారం స్వామివారి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేసి శాలువా కప్పి ఆశీర్వదించారు. అదేవిధంగా 52 బసాపురం గ్రామంలోని ఆంజినేయ స్వామి దేవాలయం ఎదుట ధ్వజస్తంభం, నవగ్రహ ప్రతిష్ఠాపన, బోడ్రాయి ఏర్పాటు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని ఆంజినేయ్య స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుంగభద్ర గ్రామంలో వెలసిన శ్రీ రాఘవేంద్ర స్వామి బృందావనం, 52 బసాపురం గ్రామంలో వెలసిన సాయిబాబాకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

- నేడు ఆంజనేయ(కోసిగయ్య) స్వామి మహారథోత్సవం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో కడపాళెం వీధిలో వెలసిన శ్రీ ఆంజనేయ (కోసిగయ్య) స్వామి ఆలయంలో గురువారం సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేకువ జామున నుంచి స్వామి వారికి ఆలయ అర్చకులు శ్రీరాములు ఆధ్వర్యంలో జలాభిషేకం పంచామృతాభిషేకం, మహా మంగళ హారులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ధర్మకర్త శ్రీనివాస రాజుదొర ఆధ్వర్యంలో వేదపండితులు జయతీర్థ ఆచార్, రఘునందన్ ఆచార్‌ల నేతృత్వంలో శ్రీ సీతారాముల వారికి ముత్యాల పందిరి వేసి వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకీలో కొలవుంచి తేరుబజారు మైదానం వరకు ఊరేగింపుగా వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రభోత్సవాన్ని స్వామివారి పాదాల చెంత వరకు లాగి తిరిగి యథావిధిగా గమ్యస్థానం చేర్చారు. నేడు పౌర్ణమిని పురస్కరించుకుని సంప్రదాయ బద్ధంగా సాయంత్రం స్వామివారి మహా రథోత్సవం నిర్వహించనున్నారు. ఇటీవల కొత్తగా వివాహం అయిన పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలు పెళ్లి రోజు నాటి దుస్తులు ధరించి రథోత్సవంలో పాల్గొనంటారు.



భక్తుల మధ్య ఊరేగుతున్న స్వామివారి ప్రభోత్సవం

ఆన్‌లైన్‌లో వివాహాల రిజిస్ట్రేషన్

- మాన్యువల్ విధానానికి స్వస్తి పలికిన ప్రభుత్వం
- రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లకుండానే దరఖాస్తు చేసుకునేందుకు వీలు
- వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుంటే ఇంటికే వివాహ పత్రాలు



కర్నూలు(సెంట్రల్): వివాహ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్ విధానంలో మరింత సులభతరమైంది. గతంలోవివాహ పత్రాలు కావాలంటే నెల రోజుల ముందు రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయితే 2023 జనవరి నుంచి ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులతో నూతన దంపతులు వివాహ పత్రాలను సులభంగా పొందవచ్చు. రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వెళ్లకుండానే ఇంటి నుంచి దరఖాస్తు చేసుకోవడం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడం వరకు ప్రక్రియను కొనసాగించవచ్చు.

గతం గతః.. : వివాహాల రిజిస్ట్రేషన్‌లో విధానంలో మాన్యువల్ విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. గతంలో వివాహాల రిజిస్ట్రేషన్ కోసం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. అక్కడ అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఇది వరకు హిందూ, ప్రత్యేక వివాహాలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మాన్యువల్ విధానంలో వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉండేది. పెళ్లికుమారుడుకి 21 ఏళ్లు, పెళ్లికుమార్తెకు 18 ఏళ్లు నిండిన తరువాత వారి ఫొటోలు, ఆధార్ కార్డులు, పదో తరగతి ధ్రువీకరణ పత్రాలు, ముగ్గురు సాక్షులతో దరఖాస్తు పూర్తి చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇచ్చేవారు. సబ్ రిజిస్ట్రార్ వాటిని పరిశీలించి సంతకం చేసిన తర్వాత వివాహ ధ్రువీకరణ పత్రం అందజేసేవారు.

ఆన్‌లైన్‌లో సులభంగా రిజిస్ట్రేషన్

ఆన్‌లైన విధానం అమల్లోకి వచ్చింది. దీంతో ఇంటి వద్ద వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం ఉంది. https//marriage.rs.gov.in//hmr వెబ్‌సైట్‌లో రెండు ఆప్షన్‌లు ఉంటాయి. హిందూ వివాహమైతే దానిపై క్లిక్ చేసి మొబైల్ నంబర్ లేదా ఈమెయిల్‌తో లాగిన్ కావాలి. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు పూర్తి చేసి ఆధార్‌కార్డులు, దరఖాస్తుదారుల ఫొటోలు, పదో తరగతి ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాలి. రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళేలదుకు స్లాట్‌ను బుక్ చేసుకొని సీఎంఎంఎఫ్ ద్వారా ఫీజు చెల్లించాలి. తరువాత దరఖాస్తు సబ్ రిజిస్ట్రార్‌కు ఇస్తే వారు పరిశీలించి సాక్షులతో సంతకాలు పెట్టించుకొని వెంటనే ధ్రువీకరణ పత్రాం జారీ చేస్తారు. రిజిస్ట్రేషన్ అయ్యాక వివాహ ధ్రువీకరణ పత్రం ఆన్‌లైన్‌లో డిస్‌ప్లే అవుతుంది. దీని కోసంసబ్ రిజిస్ట్రార్ సాధారణ సంతకం కాకుండా డిజిటల్ సంతకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.

ప్రత్యేక వివాహాలకు

హిందూ వివాహ పద్ధతిలో జరగని వివాహాలను ప్రత్యేక వివాహాలుగా పరగణిస్తారు. వీటికి సంబంధించి దరఖాస్తు విధానం మరోలా ఉంటుంది. దీనికి నెలరోజుల ముందే దరఖాస్తు చేసుకోవాలి. అభ్యంతరాలు తెలుసుకునేందుకు నెల రోజుల పాటు నోటీసు బోర్డులో ఉంచుతారు. ఎలాంటి అభ్యంతరాలు లేకపోతే యథావిధిగా ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఈఏడాది జనవరి నుంచి ఆన్‌లైన్‌వివాహ రిజిస్ట్రేషన్ విధానం అమల్లోకి వచ్చింది. వివాహ ధ్రువీకరణ పత్రాలు కావాలనుకునేవారు ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకుని స్లాట్ బుక్ చేసుకోవాలి. అందుకోసం అవసరమయ్యే రుసుం కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. తర్వాత వెబ్‌సైట్ నుంచే వివాహ రిజిస్ట్రేషన్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– నాగలింగేశ్వరరావు, జిల్లా రిజిస్ట్రార్, కర్నూలు

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

మద్దికెర: మద్దికెర గ్రామ శివార్లలో పచ్చని చెట్లు, ప్రశాంతమైన వాతావరణంలో వెలసిన శ్రీవెంకప్ప స్వామి 91వ ఆరాధన మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు గురువారం తెలిపారు. ఉదయం స్వామి వారి సమాధిని అలంకరించి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సంతాన దేవుడిగా ప్రసిద్ధి

సంతానం కలగని వారు ఎంతో మంది వెంకప్ప స్వామి వారిని నాలుగు సోమవారాలు మొక్కుకుంటే కోరిక నెరవేరుతుందని భక్తుల విశ్వాసం. అంతేగాక ఈ ప్రాంతంలో చాలా మంది వెంకమ్మ, వెంకప్ప అనే పేర్లు పెట్టుకుంటారు. అలాగే రైతులు ఆప్యాయంగా చూసుకునే పాడిపశువులకు రోగాలు వస్తే స్వామి వారి సమాధి చుట్టూ ప్రదక్షిణలు చేస్తే రోగాలు నయం అవుతాయని విశ్వాసం.

నేడు పెద్దమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠ

చిప్పగిరి: మండలంలోని కుందన గుర్తి గ్రామంలో శుక్రవారం పెద్దమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వారు మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం పలువురు పీఠాధిపతులు, పురోహితుల ఆధ్వర్యంలో అత్యంత వేడుకగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.